క్లుప్తంగా

సామూహిక యజ్ఞోపవీత ధారణ



యజ్ఞోపవీత ధారణ చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యాన ఆదివారం సామూహిక యజ్ఞోపవీత ధారణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం, గాయత్రి హోమం చేపట్టారు. అనంతరం యజ్ఞోపవీత ధారణ చేశారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పెంపు

కౌటాల: పదో తరగతి దూరవిద్యలో ప్రవేశాల గడువును ఈనెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నానాజీ ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో ఈనెల 28వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా దూరవిద్యలో ప్రవేశం పొందిన ప్రతి ఒక్కరూ సప్లిమెంటరీ పరీక్షకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు 9494029826 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఎక్కాహం



పాల్గొన్న భక్తులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్‌లోని పోచమ్మ ఆలయంలో 24 గంటలుగా సాగుతున్న ఎక్కాహం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

తాంసి: మండలంలోని పాలోది గ్రామ సమీపంలో గుట్టపై వెలిసిన శ్రీ సీతా రాముల ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాలోది గ్రామస్తులు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందించారు. గుట్టపై షెడ్డు నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కప్పర్ల మాజీ సర్పంచ్ సదానంద్, గ్రామ పెద్దలు క్లొం నాగారెడ్డి, సతీశ్ రెడ్డి, శంకర్, అరుణ్, సంతోశ్ రెడ్డి పాల్గొన్నారు.

బురద రోడ్లు

- చినుకుపడితే చిత్తడిగా
- గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానం
- రాకపోలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా నాగల్‌గొంది వెళ్లేదారి

కెరమెరి: చినుకుపడితే ఆ రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఏటా ఈ పరిస్థితి. ఇతర గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్లు బురదగా మారుతున్నాయి. బైక్, అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితి. నేటికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు, రాళ్లురప్పల మధ్య నడవాల్సిన దుస్థితి. గుంతల్లో మురుగునీరు నిలిచి ఉంది. వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మండలంలోని ఆగర్‌వాడ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, నాగల్‌గొంది గ్రామాల ఆదివాసీలు సైతం పడరాని పాట్లు పడుతున్నారు. కొలాంగూడలో కల్వర్టు పగిలిపోయింది. ఆయా గ్రామాల్లో 105 కుటుంబాలకు సుమారు 400 జనాభా ఉంది. వారు నిత్యం కెరమెరి, ఆసిఫాబాద్ తదితర గ్రామాలకు వెళ్తుంటారు. వర్షాలకు రోడ్డు బురదగా మారడంతో ఆదివాసీల అవస్థలు ఎదుర్కొంటున్నారు. దారి పొడువున కచ్చా, మట్టి రోడ్డు ఉండడం వల్ల వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. అనేక చోట్ల ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు చేరుతోంది. సుమారు 50 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామాలకు నేటికి తారు రోడ్డు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గతంలో అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించిన పట్టించుకోలేదని వాపోతున్నారు.

వర్షాలు కురిస్తే చాలు..

ఆ రెండు గ్రామాలకు వెళ్లేదారిలో వాగులు ఉన్నాయి. వర్షాలు కురిస్తే వాగులు పొంగితాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్లపై గుంతలు పడడంతో వర్షపు నీరు నిలుస్తోంది. మరికొన్ని చోట్ల బురదగా మారిపోతున్నాయి.



నాగల్‌గొంది-ఆగర్‌వాడ మధ్యలో చెరువు నుంచి వెళ్తున్న మహిళలు



కొలాంగూడలో పగిలిపోయిన కల్వర్టు

కష్టమవుతుంది



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు మొత్తం కోతకు గురైంది. కెరమెరికి వెళ్లాలంటే కష్టమవుతుంది. గతంలో మట్టి రోడ్డు వేసినప్పటికి వరద నీటితో కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి సీసీ లేదా బీటీ రోడ్డు వేయాలి.

– సిడాం ధర్మూ, పీవీటీసీ సూపర్‌వైజర్

నిలిచిన పనులు



ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన రోడ్డు

- ఎనోలి గ్రామానికి 3.5 కి.మీ బీటీ రోడ్డు మంజూరు
- పనులు మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

వాంకిడి: మండలంలోని ఎనోలి గ్రామానికి దశాబ్దాల కాలంగా సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలోనే ఎనోలి గ్రామానికి 3.5 కి.మీ బీటీ రోడ్డు మంజూరు చేస్తూ రూ.1.86 కోట్ల నిధులు విడుదల చేసింది. పాటగూడ పంచాయతీలోని నీమ్‌గాం గ్రామం నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికిగాను ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. పనులను ప్రారంభించి ఒక కి.మీ మేర సన్నటి కంకర(చూర)ను పోసి పనులను అంతటితోనే నిలిపివేశాడు. దాదాపు ఏడాది కావస్తున్నా తిరిగి మళ్లీ ప్రారంభించలేదు. రోడ్డుగుండా కి.మీ మేర ఫారెస్ట్ ల్యాండ్ ఉందని అటవీ అధికారులు పనులు అడ్డుకున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. అయితే అక్కడ ఫారెస్ట్ ల్యాండ్ లేదని ఈ విషయాన్ని డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లామని పేర్కొంటున్నారు. అలాగే బిల్లులు కూడా సకాలంలో అందడం లేదని సమాచారం. కొంతవరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఒక్క బిల్లు కూడా అందలేదని తెలుస్తోంది. దీంతో పనులు పునఃప్రారంభించడం లేదని సమాచారం. నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో జరుగుతున్న జాప్యానికి ఈ ఏడాది దారి కష్టాలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చిత్తడిగా ఎనోలి రోడ్డు

రోడ్డు పనులు పూర్తిచేయాలి



గతేడాది రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో దారి కష్టాలు తీరుతాయని అనుకున్నాం. కానీ పనుల ప్రారంభంలో వదిలేయడంతో ఈ ఏడాది కష్టాలు పడాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– సీడం ధర్ము, గ్రామపటేల్

అధికారులు స్పందించాలి



దశాబ్దాలు గడుస్తున్నా దారి కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో రోడ్డు చిత్తడిగా మారుతుంది. గుంతల్లో నీరు నిలుస్తుంది. అత్యవసర సమయాల్లో ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన పనుల చేపట్టడంలో జాప్యం జరుగుతుంది. అధికారులు స్పందించి వీటి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మొహర్లే నారాయణ, గ్రామపటేల్

‘ఇందిరమ్మ’కు.. అడ్డుగా స్తంభం

బెజ్జూర్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి విద్యుత్ స్తంభం అడ్డుగా మారింది. మండలంలోని చిన్నసిద్దాపూర్‌కు చెందిన నికురి విజయ-రమేశ్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పనులు ప్రారంభించి పునాది నిర్మాణం పూర్తి చేశారు. ఇల్లు నిర్మాణం కొనసాగాలంటే ఇంటి పక్కన ఉన్న స్తంభం తొలగించాలని మేస్త్రీలు చెబుతున్నారు. అధికారులకు విన్నవిస్తే స్తంభం తొలగించే ఖర్చు మొత్తం మీరే భరించుకోవాలని చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ దంపతులు ఇక్కడా పనులు దొరకక గతకొన్నేళ్ల క్రితం దూర ప్రాంతాలకు వలసవెళ్లి బతుకుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.



లోవోల్టేజీపై రైతుల ఆగ్రహం

- విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ఐనం గ్రామస్తుల ధర్నా
- అధికారులు పట్టించుకోలేదని ఆరోపణ



కాగజ్‌నగర్ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ లోఓల్టేజీతో ఇళ్లలోని వస్తువులు, వ్యవసాయ మోటారు పంప్‌లు కాలిపోతున్నాయని విద్యుత్ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని దహెగాం మండలం ఐనం గ్రామ రైతులు, గ్రామస్తులు కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేపట్టారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా చేపట్టినా వారిని పట్టించుకునేవారు లేకపోవడంతో డీఈకి ఫోన్ ద్వారా సంప్రదిస్తే స్పందించలేదు. ఏడీఈ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా స్పందించి ఆదివారం సెలవుదినం ఎవరైనా ఆఫీసులో ఉంటారా ఈరోజు ధర్నా ఎందుకు చేశారని బాధ్యతరహిత్యంగా సమాధానం చెప్పడంతో రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. వెంటనే దహెగాం ఏఈ రవీందర్ ఫోన్ చేసి కార్యాలయంలో ఉన్న సిబ్బందికి అప్లికేషన్ ఇవ్వండి నేను వచ్చాక సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఐనం గ్రామంలో నెలరోజులుగా లోఓల్టేజీతో వస్తువులు కాలిపోతున్నాయన్నారు. పగటిపూట మాత్రమే కరెంట్ వస్తుందని, సాయంత్రమైతే లోఓల్టేజీ ఉంటుందని గత జులై 2న దహెగాం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టడంతో రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పినా పరిష్కారం కాలేదన్నారు. అధికారులు కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తాం

సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సిద్ధం చేశాం. రెండురోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఏఈ, దహెగాం

సమస్య పరిష్కరించాలి



ఐనం గ్రామంలో లోఓల్టేజీతో గ్రామస్తులు రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం వేళ బయటకు వెళ్లాలంటే భయంతో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. విద్యుత్ సమస్యను పరిష్కరించాలి.

– పందిరి అశోక్, గ్రామస్తుడు

పొలం ఎండిపోతుంది



పొలంలో పంటకు నీరు పెడుతామంటే లోఓల్టేజీ కరెంట్‌తో నీరు పెట్టలేకపోవడంతో వరి ఎండిపోయింది. లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. ఏఈకి చెప్పినా పట్టించుకోవడం లేదు. పంటకు నీరు పెట్టేందుకు లోఓల్టేజీతో మోటారు కాలిపోయింది.

– బావాజీ, రైతు

ఏఈకి విన్నవించాం



ఐనంలో లోఓల్టేజీ సమస్య ఉందని దహెగాం సబ్‌స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందించాం. కానీ ఏఈ పట్టించుకోలేదు. ఫోన్ చేసినప్పుడల్లా రేపుమాపు చేస్తామని చెప్పడమే తప్ప పరిష్కారం చూపడం లేదు.దీంతో కాగజ్‌నగర్‌లో ధర్నా చేశాం.

– విఘ్నేష్, గ్రామస్తుడు

‘విద్యుత్’పై అప్రమత్తత అవసరం



కాగజ్‌నగర్ మండలం జీడిచేను గ్రామానికి చెందిన సురేశ్(22) పట్టణంలోని ఓ కిరాణా షాపులో పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. గత నెల 22న వారి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ రిపేర్ చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. చేతికందిన కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాధం నెలకొంది. ఇలా విద్యుత్ వినియోగంపై సరైన అవగాహన లేక ఏటా అనేకమంది మృత్యువాత పడుతున్నారు.

- వినియోగంపై అవగాహన కరువు
- విద్యుదాఘాతంతో ఏటా పలువురు మృత్యువాత
- వర్షాకాలంలో ప్రమాదాలకు అవకాశం

కౌటాల: జిల్లా వ్యాప్తంగా ఇటీవల కొద్ది రోజులు పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ క్రమంలో రైతులు సాగు పనుల్లో బీజీగా ఉన్నారు. ముఖ్యంగా వరినాట్ల నేపథ్యంలో విద్యుత్ మోటర్లను వినియోగించనున్నారు. విద్యుత్‌పై అవగాహన లేక ఏటా



విద్యుత్ ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. చేతికందే ఎత్తులో ఉన్న వైర్లు.. నిర్వహణ లోపంతో తరుచూ తెగిపడుతున్న లైన్లు షాకిస్తున్నాయి. దీంతో జనంతో పాటు మూగజీవాల ప్రాణాలు హరిస్తున్నాయి. ఈదురు గాలులు వీచిన సమయంలో పలుమార్లు విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ ట్రిప్‌తో పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కాని నిర్వహణ లోపంతో జిల్లాలోని పలు ఫీడర్లు ట్రిప్పవకపోగా యథావిధిగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో పలుమార్లు మూగజీవాలతో పాటు అమాయక రైతులు సైతం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటనలున్నాయి. జిల్లాలో 1.34 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు, 13వేల వాణిజ్య, 600లకు పైగా పరిశ్రమలు, 12 వేలకు పైగా వ్యవసాయ, కేటగిరి(6) 3వేల వరకు, కేటగిరి (7) 1200లకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు..

జిల్లాలో ఏ గ్రామంలోకి తొంగి చూసినా చెట్ల కొమ్మల మధ్యన చేతికందే ఎత్తులో వేలాడుతున్న వైర్లు దర్శనమిస్తున్నాయి. లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా సరఫరా వ్యవస్థ మెరుగు పడకపోగా మరింత ప్రమాదకరంగా తయారవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ సరఫరాపై పర్యవేక్షణ కరువైంది. జిల్లాలోని ఆయా ఇళ్లల్లో సరైన విద్యుత్తు వైరింగ్ లేకపోవడంతో తరుచూ చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. నాసిరకమైన వైర్లు చాలా ఇళ్లల్లో వేలాడుతూ ఉంటాయి. గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా లేక ప్రాణాలు కోల్పోతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో బావుల వద్ద తీగలు వేలాడుతున్నాయని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేయొద్దు



వర్షాకాలంలో విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లల్లో విద్యుత్తు తీగలు రేకుల తాకేలా లేకుండా చూసుకోవాలి. గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడినా, తెగిపడినా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. విద్యుత్ సమస్య ఉంటే సిబ్బందిని సంప్రదించాలి. సొంతంగా మరమ్మతులు చేయొద్దు.

– రాజేశ్వర్, ఇన్‌చార్జి ఏఈడీ, కౌటాల

అవగాహన తప్పనిసరి..

- తీగలు, తడి ప్రదేశం తదితర మార్గాల ద్వారా ప్రసరించే గుణం ఉన్న విద్యుత్ కారణంగా ఏటా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. అవగాహన, అప్రమత్తతతో ఉంటే వీటిని నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. విద్యుత్తు ప్రమాదాల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.
- ఇళ్లల్లో పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయ మోటరు సామర్థ్యానికి తగిన నాణ్యత గల తీగలు మాత్రమే వాడాలి. మోటర్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఉండాలి. తీగలు వదులుగా నేలమీద ఉంచరాదు. పంపుసెట్లు పాడైతే సొంతంగా మరమ్మతులు చేయొద్దు.
- తెగి కిందపడిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకరాదు. తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్తు పరికరాలు తాకడం, స్విచ్‌లు వేయడం సరికాదు. విద్యుదాఘాతానికి గురైన వ్యక్తిని నేరుగా తాకరాదు. పొడికర్ర లేదా విద్యుత్ ప్రవహించని ప్లాస్టిక్ వస్తువులతో మాత్రమే ప్రమాదానికి గురైన వ్యక్తిని తప్పించాలి. వెంటనే ఆసుపత్రికి తరలించాలి.


రిటైర్డ్ జవాన్‌కు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం విలేజ్ నం.2కు చెందిన సుశాంత్‌బర్మన్ ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందగా, ఆదివారం కాగజ్‌నగర్ రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శివకుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేందుకు సరైన చోటు లేదని పేర్కొన్నారు. కొంతమంది ఆర్మీ స్టిక్కర్లు వేసుకుని నంబర్ ప్లేట్ లేకుండా బైక్‌లు నడుపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పియూష్ మండల్, కార్యనిర్వాహక కార్యదర్శి వినాయక్ చండే, పాపయ్య, విజయ్‌కుమార్, నరేందర్, శివప్రసాద్, ముఖేష్ సింగ్, రాబిన్ హల్దార్, నీరజ్, మధుసూదన్, దాస్, సుశాంత్, బుర్మాన్, బిస్వాస్, నిర్మల్ బిస్వాస్, సునీల్ మండల్, విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.



సుశాంత్‌బర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

గ్రామాభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొరటికల్ హనుమాన్ ఆలయం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. నిత్యం ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, మండల కన్వీనర్ శివారెడ్డి, శ్రీను, ప్రతాప్, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.